## క్లుప్తంగా

### సంగమేశ్వరుని సేవలో ఆలయ ఈవో



సంగమేశ్వరుని దర్శించుకుంటున్న ఈవో శ్యామలరావు

వంగర: మండలంలోని సంగాం గ్రామంలో వెలసిన పవిత్ర సంగమేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ఈవో పొన్నాడ శ్యామలరావు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవోగా ఉదయం బాధ్యతలు స్వీకరించిన అనంతరం సంగమేశ్వరుని దర్శించుకున్న ఆయనకు ఆలయ ప్రధానార్చకులు సిద్ధాంతం గణపతిరావు సాదరస్వాగతం పలికి, విశేష పూజలు చేసి స్వామి వారి ఆశీర్వచనాలు అందజేశారు. అంతకుముందు కార్తీకమాసంలో భక్తుల పూజలకోసం ఆలయ ఆవరణం ఎలా సిద్ధం చేయాలి, త్రివేణి సంగమం వద్ద స్నానాల ఏర్పాట్లపై ఉత్సవ కమిటీ చైర్మన్ బోను ఆనందరావు, ఆలయ ప్రధానార్చకులతో చర్చించారు.

### రాష్ట్ర స్థాయి పోటీలకు రామభద్రపురం విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రామభద్రపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పెద్దింటి రాజేష్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. అండర్–17 విభాగంలో ఈ నెల 19వ తేదీన విజయనగరం జిల్లా కేంద్రంలోని విజ్జీ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో విశేష ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయురాలు డి.శ్రీదేవి సోమవారం తెలిపారు. రాష్ట్ర స్థాయిలో కూడా సత్తా చాటి, జాతీయ స్థాయిలో ఆడాలని ఆకాంక్షిస్తూ సదరు విద్యార్థికి ఉపాధ్యాయ సిబ్బందికి ఆల్ ది బెస్ట్ తెలిపారు.

### పరామర్శ



శ్రీను చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ తలే రాజేష్, తదితరులు

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని తెలగ వీధికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు సోరాడ శ్రీను ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ సోమవారం పరామర్శించారు. అంతకుముందు శ్రీను చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ పరంగా అండగా ఉంటామని బాధిత కుటుంబానికి భరోసానిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, పార్టీ నాయకులు వంజరాపు విజయ్‌కుమార్, తోట తిరుమలరావు, ఆసపు సూర్యం, సోరాడ వాసు తదితరులు పాల్గొన్నారు.

### తాగునీటి స్వచ్ఛత పరీక్షలు



తాగునీటి నాణ్యతను పరీక్షిస్తున్న వైద్య, సచివాలయ సిబ్బంది

బాడంగి: మండలంలోని కోటిపల్లి తదితర గ్రామాల్లో వాడాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో తాగునీటి స్వచ్ఛత పరీక్షలు సోమవారం నిర్వహించారు. పరిశుభ్రమైన తాగునీటినే తాగాలని సిబ్బంది సూచించారు. కలుషిత నీటి ద్వారానే డయేరియా తదితర రోగాలు ప్రబలుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం గౌరీదేవి, ఎంఎల్‌హెచ్‌పీ జానకి తదితరులు పాల్గొన్నారు.

---

రాజాం మండలంలోని పెనుబాక మామిడితోటల్లో చెట్ల చుట్టూ కందకాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం



- ఉపాధి హామీ పథకం పనుల్లో న్యూ స్ట్రాటజీ వర్క్స్
- నీటి కుంటలు, కందకాల పనులకు ప్రాధాన్యం
- హార్టికల్చర్ ద్వారా పండ్లతోటల పెంపకానికి ప్రోత్సాహకాలు
- పచ్చదనం, శాశ్వత ఫలసాయమే ధ్యేయంగా అడుగులు
- ఆసక్తి ఉన్న రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- ఇప్పటివరకు 80కి పైగా వచ్చిన దరఖాస్తులు

# కొత్త పనులు ఆరంభం

రాజాం:

ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా ప్రస్తుతం న్యూ స్ట్రాటజీ వర్క్స్(పనులు) ఆరంభమయ్యాయి. ఇప్పటికే ఈ పనులకు మంచి ఆదరణ ఉండగా, ఇటీవల నిర్వహించిన గ్రామసభల ద్వారా మరికొన్ని పనులకు రైతుల నుంచి దరఖాస్తులు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వమే ఎన్ఆర్ఈజీఎస్(జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం) ద్వారా రైతులను ప్రోత్సహించడమే కాకుండా వారికి పక్కాగా వంద రోజుల పని కల్పించే దిశగా చర్యలు చేపడుతోంది. పచ్చదనమే ప్రధానంగా న్యూ స్ట్రాటజీ వర్క్స్ పేరుతో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చి, గ్రామాల్లో అంచనాలు రూపొందిస్తోంది. అటు రైతులు, ఇటు వేతనదారులు దీర్ఘకాలికంగా లబ్ధి పొందడం, అన్ని ప్రాంతాల్లో పచ్చదనం, పండ్లతోటల ద్వారా రైతులకు శాశ్వత ఫలసాయం అందివ్వడమే ధ్యేయంగా ఈ పనులు చేపట్టడం జరుగుతోంది.

**మూడేళ్లకు రూ.35 వేలు..**

న్యూ స్ట్రాటజీ పనుల్లో భాగంగా రైతులు తమ పొలాల్లో పండ్లతోటలు పెంచుకునేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా ప్రోత్సాహకాలు కల్పించడం జరుగుతోంది. హార్టికల్చర్ ద్వారా 14 రకాల పండ్ల తోటల మొక్కలను రైతులకు ఉచితంగా ఇవ్వనున్నారు. ఆసక్తి ఉన్న చిన్న, సన్నకారు రైతులకు ఎకరాకు 60 నుంచి 70 వరకు మొక్కలు ఇస్తారు. వీటిని పొలాల్లో నాటడంతో పాటు మూడేళ్ల పాటు వాటిని పెంచుకునేందుకు ఏడాదికి రూ.35 వేల వరకు నిధులను ఉపాధి పథకం ద్వారా అందిస్తారు. మూడేళ్ల అనంతరం మొక్కల ఫలసాయం ఆయా రైతులే పొందవచ్చు.



రేగిడి మండలంలోని సంకిలి జీడితోటలో కందకాలు తవ్వుతున్న వేతనదారులు

**ఓ వైపు చెట్ల సంరక్షణ, మరోవైపు ఆదాయం..**

పచ్చదనమే ప్రధానంగా ఉపాధి హామీ పథకంలో భాగంగా కొత్త పనులు ప్రారంభమయ్యాయి. రైతులు తమ పొలాల చుట్టూ, పొలాల గట్లు, పొలాల్లోని చెట్లు, మొక్కల చుట్టూ కందకాలు(ట్రెంచ్‌లు) ఏర్పాటుకు ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు చెల్లిస్తున్నారు. ఒక్కోచోట ఈ పనుల ద్వారా రైతులకు అటు పొలాల వద్ద చెట్లు సంరక్షించుకునే అవకాశం లభించడంతో పాటు రూ.17 వేల వరకు వేతనం లభిస్తుంది. మరోవైపు ఈ కందకాల కారణంగా చెట్టుకు నీటి సదుపాయం లభిస్తుంది. పొలాల్లో నీటి కాలువలు ఏర్పడతాయి. ఒక పొలం నుంచి మరో పొలానికి చీడపీడలు వెళ్లవు. ఎకరా నుంచి మూడెకరాల వరకు పొలాలున్న రైతులు తమ మెట్టు ప్రాంత పొలాల్లో నీటికుంటలు తవ్వుకునేందుకు నిధులు కేటాయిస్తున్నారు. 9 మీటర్ల వెడల్పు, 9 మీటర్ల పొడవుతో పాటు రెండు మీటర్ల లోతు మేర వీటిని తవ్వుకోవాలని, వీటికి రూ.50 వేల వరకు ఇస్తామని అధికారులు చెబుతున్నారు.

**80కి పైగా దరఖాస్తులు..**

న్యూ స్ట్రాటజీ వర్క్స్‌కు గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలోని రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల నుంచి మొత్తం 80కి పైగా దరఖాస్తులు వచ్చినట్లు రాజాం ఏపీడీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

**ఉపయోగించుకుంటే చాలా మంచిది..**



న్యూ స్ట్రాటజీ వర్క్స్‌లో భాగంగా పండ్లతోటలు, టేకుమొక్కలు పెంచుకునేందుకు అవకాశం కల్పించడం, కందకాల నిర్మాణానికి నిధులు కేటాయించడం చేస్తున్నాం. ఇటు రైతులకు, అటు వేతనదారులకు ఈ పథకం చాలా మంచిది. రైతులు ముందుకు వచ్చి, ఈ అవకాశం వినియోగించుకుంటే ప్రయోజనం ఉంటుంది.

–కె.సాయిరాం, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో, రాజాం

---

## సీహెచ్‌సీకి రోగుల తాకిడి



బాడంగి సామాజిక ఆరోగ్య కేంద్రంలో క్యూలైన్‌లో రోగులు

బాడంగి: మండల కేంద్రంలోని సీహెచ్‌సీ(కమ్యూనిటీ హెల్త్ సెంటర్)కి రోగుల తాకిడి రోజురోజుకూ ఎక్కువవుతోంది. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారంతా ఆస్పత్రి బాటపడుతున్నారు. సోమవారం ఉదయం ఆస్పత్రి ప్రవేశ ద్వారం దగ్గర నుంచి ఓపీ గది వరకు వైద్య తనిఖీల కోసం క్యూ కట్టారు. జ్వరం, విరేచనాలు, ఒళ్లు నొప్పులు, సుగర్ సమస్యలతో బాధపడున్న వారే అధికంగా ఉన్నట్లు సిబ్బంది చెబుతున్నారు. అయితే సకాలంలో సేవలు అందడం లేదని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అవసరమైన మందులు కూడా అందుబాటులో లేవని, ప్రైవేటు షాపుల వద్ద కొనుగోలు చేసుకోవాలని వైద్యులే చీటీలు రాసి ఇస్తున్నారని పలువురు వాపోతున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న వేళ వైద్యసేవలు సత్వరమే అందించాల్సి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## మద్యం దుకాణం వద్దు

రేగిడి: మండలంలోని దేవుదళ గ్రామ సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని టీడీపీ నేతలు ఎర్నేన రామినాయుడు, వై.ఆదినారాయణ, కెంబూరి కోటేశ్వరరావులతో పాటు కొంతమంది మహిళలు కోరుతున్నారు. ఇదే విషయమై వారంతా విజయనగరం జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన కలెక్టర్ గ్రీవెన్స్‌కు హాజరై, దేవుదళలో మద్యం షాపు ఏర్పాటు వల్ల కలిగే అనర్థాలు, ఎదురయ్యే ఇబ్బందులను వివరించారు. సంకిలి సుగర్ ఫ్యాక్టరీ వద్దనే దేవుదళ వెళ్లే రోడ్డులో వైన్ షాపు పెట్టడంతో ఫ్యాక్టరీకి వచ్చే లారీలు, ట్రాక్టర్ల డ్రైవర్లు పూటుగా మద్యం తాగి, అటువైపుగా వెళ్లే మహిళలు, విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని విజ్ఞప్తి చేస్తే అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం షాపు ఏర్పాటు చేయలేదని, ఇప్పటి కూటమి ప్రభుత్వం కూడా తక్షణమే స్పందించి, షాపు నిర్వహణను నిలుపుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.



బొబ్బిలి: మద్యం దుకాణ ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిరసన చేపడుతున్న మహిళలు

**మహిళల నిరసన**

బొబ్బిలి: జనావాసాల వద్ద మద్యం షాపుల ఏర్పాటును వ్యతిరేకిస్తూ స్థానిక పట్టణంలోని మేదరిబంద వద్ద మహిళలు చేపడుతున్న నిరసన సోమవారం నాటికి ఐదో రోజుకు చేరుకుంది. ఇక్కడే కాన్వెంట్, చర్చి ఉన్నా మద్యం దుకాణం ఏర్పాటుకు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. నిబంధనలను తుంగలోకి తొక్కుతూ ఏర్పాటు చేసిన షాపును తీసివేయాలని కోరినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఇక్కడి వైన్ షాపును వేరే ప్రాంతానికి తరలించాలని కోరారు.

## సీఐటీయూ ఆందోళన

రేగిడి: గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు ఎన్నికలప్పుడు కూటమి ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.శంకరరావు, ఎ.జగన్మోహనరావులు స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ నెలల తరబడి జీతాలు అందకపోవడంతో మధ్యాహ్న భోజనం వంట నిర్వాహకులు, క్లాప్‌మిత్రలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని, రాజకీయ ఒత్తిళ్లతో వారి ఉద్యోగాల తొలగింపులు ఆపాలని, బకాయి వేతనాలు తక్షణమే అందించాలని, వలంటీర్లను కొనసాగించాలని కోరారు. అనంతరం తహసీల్దారు ఎల్లారావుకు వినతిపత్రం అందజేశారు. వారి వెంట సీఐటీయూ నేత ఎం.త్రినాధరావు ఉన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

సంతకవిటి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కె.సురేష్‌కుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశమైన ఆయన గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని తెలిపారు. మలేరియా, డెంగీ, డయేరియా వంటి సీజనల్ వ్యాధుల బారినపడకుండా గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

## నీమాస్త్రం తయారీపై అవగాహన



నీమాస్త్రం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రాజాం: మండలంలోని కొఠారిపురం గ్రామంలో నీమాస్త్రం తయారీపై సోమవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ఎల్‌వన్ పి.రమాదేవి, ఐసీఆర్‌పీ టి.అరుణకుమారిలు తొలుత ప్రయోగాత్మకంగా నీమాస్త్రం తయారీని రైతులకు వివరించారు. పది కిలోల వేపాకు, పది లీటర్ల ఆవు మూత్రం, రెండు కిలోల పేడను 200 లీటర్ల నీటిలో కలిపి, మూడు రోజుల పాటు నిల్వ ఉంచగా తయారైన నీమాస్త్రాన్ని వడకట్టి మొక్కజొన్న, పెసర, మినప పంటలపై పిచికారీ చేస్తే పురుగు గుడ్డును నివారించవచ్చన్నారు.

---

## 105 శునకాలకు ఏబీసీ ఆపరేషన్లు



ఆపరేషన్‌కు తరలిస్తున్న కుక్కలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం: మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటివరకు 105 శునకాలను పట్టుకుని, వాటికి ఏబీసీ(యానిమల్ బర్త్ కంట్రోల్) ఆపరేషన్లు నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు తెలిపారు. స్థానిక పట్టణంలోని మెయిన్‌రోడ్డు, అన్న క్యాంటీన్, బొబ్బిలి సెంటర్ ప్రాంతాల్లో సంచరిస్తున్న కుక్కలను పట్టుకుని, ఆపరేషన్లకు తరలిస్తుండడాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. రాజాం మున్సిపాలిటీలో మొత్తం 302 కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని, విడతల వారీగా కార్యక్రమాన్ని పూర్తి చేస్తున్నామన్నారు. శ్రీకాకుళం ఏజెన్సీ వారితో కుక్కలను పట్టించి, ఆపరేషన్లు చేయిస్తున్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తెలిపారు.

## పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరించిన పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావు, తదితరులు

రాజాం: మండల కేంద్రంలోని వైఎస్సార్ పార్కు వద్ద పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత ఆసపు సూర్యం రాసిన సూర్యం మాట వెలుగు బాట అనే పుస్తకాన్ని పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పాలవలస పద్మావతిలు సోమవారం ఆవిష్కరించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావం, మానవతా విలువలతో కూడిన పుస్తకాన్నో సూర్య రాశారని, ఆయన గొప్ప రచయిత అని ప్రశంసించారు. సమాజాన్ని మేల్కొలిపే రచనలు భవిష్యత్‌లో మరిన్ని చేయాలని ఆకాంక్షించారు. అనంతరం రచయిత సూర్యంను సత్కరించారు. కార్యక్రమంలో రాజాం పట్టణ చేనేత నాయకులు మాణిక్యం నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మాణిక్యం నాగేశ్వరరావు, గోకవలస బాబూరావు, వెంపల లక్ష్మణరావు, సలాది సత్తిష్, పాలవలస రాంబాబు, ముగడ రవి, చల్లా జయరాం, జినగం ఈశ్వరరావు, పిట్టా జగదీష్, జి.పాపారావు, పక్కి రమేష్‌పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణ దిశగా తోటపల్లి కాలువ గట్టు!



తోటపల్లి కాలువ గట్టుపై కంకరను అక్రమంగా తరలించి చదును చేస్తున్న దృశ్యం

బొబ్బిలిరూరల్: మండలంలోని పిరిడి గ్రామాన్ని ఆనుకుని ఉన్న తోటపల్లి కాలువ గట్టును కొంత మంది ఆక్రమణదారులు ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారు. రాత్రి వేళల్లో గట్టుపై ఉన్న మట్టి, కంకరను జేసీబీ సాయంతో ట్రాక్టర్లలోకి లోడు చేసి, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఆ విధంగా చదునైన ప్రాంతాన్ని ఆక్రమించుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదివరకే అక్కడ చదును చేసిన ప్రాంతం ఆక్రమణకు గురైందని, ఆ ప్రాంతం పక్కనే ప్రస్తుతం కొత్తగా నేలను చదును చేసి ఆక్రమించుకునేందుకు అక్కడి కంకర, మట్టి తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు దృష్టిసారించి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రం ప్రారంభం



కూరగాయలు విక్రయిస్తున్న ప్రకృతి వ్యవసాయం ప్రతినిధులు

బొబ్బిలిరూరల్: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రం సోమవారం ప్రారంభమైంది. మండలంలోని మెట్టవలస, జగన్నాథపురం, కోమటపల్లి, పెంట తదితర గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విధానాల ద్వారా పండించిన కూరగాయలను విక్రయించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం ప్రతినిధులు ప్రసాద్, లక్ష్మి, శంకరరావులు మాట్లాడుతూ ప్రకృతి సేద్యంలో భాగంగా సేంద్రియ ఎరువులతో పండించిన పంటలు తింటే ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. ప్రతీ సోమవారం ఇక్కడ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తూ పండించిన పంటలను విక్రయిస్తామన్నారు.

తెర్లాం: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రం సోమవారం నిర్వహించి, ప్రకృతి సేద్యం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలను విక్రయించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబిస్తూ పండించిన పంటలను ఆహారంగా తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఎంఈవో జె.త్రినాధరావు, ఏపీఎం టి.రాము తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి, ప్రకృతి వ్యవసాయం మండల యూనిట్ ఇన్‌చార్జ్ తులసి పాల్గొన్నారు.

వంగర: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రం ఏర్పాటు చేసి, ప్రకృతి సేద్యం ద్వారా పండించిన ఆకు, కూరగాయల పంటలను విక్రయించారు.

## అమ్మడమ్మకు కన్నీటి వీడ్కోలు





అమ్మడమ్మ పార్థివదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే జోగారావు



అమ్మడమ్మ అంత్యక్రియలకు హాజరైన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ పక్కనే మాజీ ఎమ్మెల్యే శంబంగి

- స్వగ్రామం పక్కిలో విశాఖ డెయిరీ డైరెక్టర్ అంత్యక్రియలు
- రాజకీయ ప్రముఖులు, అధికారుల హాజరు

బొబ్బిలి: విశాఖ డెయిరీ డైరెక్టర్, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సోదరుడు శ్రీరాములునాయుడి సతీమణి శంబంగి అమ్మడమ్మ అంత్యక్రియలు మండలంలోని పక్కిగ్రామంలో సోమవారం నిర్వహించారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, బంధువులు, రాజకీయ ప్రముఖులంతా ఈ కార్యక్రమానికి హాజరై, అమ్మడమ్మకు కన్నీటి వీడ్కోలు పలికారు. కొన్నాళ్లుగా ఆమె తీవ్ర అస్వస్థతతో విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందిన విషయం తెలిసిందే. విశాఖ నుంచి సోమవారం ఉదయం ఆమె మృతదేహం స్వగ్రామం పక్కికి తీసుకుని రాగా, మధ్యాహ్నం అంతిమ సంస్కారాలు నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మాజీ డిప్యూటీ సీఎంలు పీడిక రాజన్నదొర, ధర్మాన కృష్ణదాస్, పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే జోగారావు, వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బొత్స కాశినాయుడు, విశాఖ డెయిరీ చైర్మన్ అడారు ఆనందరావు, డెయిరీ డిప్యూటీ జనరల్ మేనేజర్, సిబ్బంది, బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులంతా ఆమె పార్థివదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. ఓం శాంతి బ్రహ్మకుమారీస్ బొబ్బిలి ఇన్‌చార్జి రాజేశ్వరి ఆధ్వర్యంలో అమ్మడమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని బ్రహ్మకుమారీలు ప్రార్థనలు చేశారు.

---

## పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి



రామభద్రపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఐ ప్రసాదరావు, తదితరులు



బాడంగి: ర్యాలీలో నినాదాలు చేస్తున్న పోలీసులు



బొబ్బిలి: ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మానవహారంగా ఏర్పడిన విద్యార్థులతో పోలీసులు

బొబ్బిలి: పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని సీఐ కటకం సతీష్‌కుమార్ కొనియాడారు. స్థానిక పట్టణంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా పోలీసులు, విద్యార్థులు సోమవారం ర్యాలీ నిర్వహించి, దేశ ప్రజల పరిరక్షణలో పోలీసుల కృషిని ప్రశంసిస్తూ నినాదాలు చేశా రు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మానవహారంగా ఏర్పడి, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా స్థానిక పట్టణంలోని పోలీస్‌స్టేషన్ నుంచి మెయిన్ రోడ్డు కూడలి వరకు పోలీసులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విధి నిర్వహణలో ఉంటుండగా ప్రాణాలు కోల్పోయిన పోలీసులకు నివాళులర్పించి, వారి త్యాగాలను స్మరించుకున్నారు. వీర జవానులకు సెల్యూట్.. పోలీస్ అమరవీరుడా వందనం అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు కొండలరావు,పెంటయ్య పాల్గొన్నారు.

రామభద్రపురం: మండల కేంద్రంలో ఎస్‌ఐ వి.ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దిన ర్యాలీలో పోలీసులు, సచివాలయ మహిళా పోలీసులు, చొక్కాపు రామినాయుడు తదితరులు పాల్గొని, విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు నివాళులర్పించారు. అనంతరం వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఎస్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.